# వసంతం వెళ్ళిపోయింది !

—ఆదూరి వెంకట సీతారామమూర్తి

ఎర్రగా వేడిగా వుండాల్సిన ఎండ యేమబ్బుల మాటునో దాగుండి వరుణదేవుణ్ణి లోకం మీదికి పంపింది. వరుణదేవుడు ఓచూపు చూసి వెను దిరిగాడు—

వర్షం కొద్దిసేపే కురిసినా వాతావరణాన్ని మార్చేసింది అను కున్నాడు శ్రీహరి కంపార్ట్‌మెంట్లోం చి చూస్తూంటే తడిసిన చెట్లు, చేమ, వంగి నేలా కలగలసి ఖరీదైన లేత నీలం గుడ్డపై మంచి అభిరుచిగల జవ్వని కుట్టిన అందమైన ఎంబ్రాయిడరీ కళాఖండంలా వుంది—

రైలు వాల్తేరులో ఆగింది—లేచి, ప్లాట్‌ఫాం మీదికి దిగి కాఫీ తీసుకున్నాడు— కాస్సేపట్లోనే రైలు కదిలి వేగాన్ని పుంజుకుంది— చల్లని గాలి జోరుగా వీస్తుంటే చలిగావున్నా హరికి హాయిగానే అన్పించింది—

దూరంగా ఎత్తైన కొండలు.. ఆమధ్యనే కోనేరు— వెలుగు నీడల మధ్య అందాన్నొలికిస్తున్నాయి—

హరికి చప్పున విజయనగం గుర్తుకొచ్చింది. 'అవున! వచ్చేదే విజయనగరం !' అనుకున్నాడు—

విజయనగరం పేరు తల్చు కుంటేనే రామ్మూర్తి మాష్టారు గుర్తు కొస్తారు తన చిన్నతనం గుర్తు కొస్తుం ది. వసంత, తామరకోనేరు, అందం గా లేకపోయినా అభిమానాన్ని పంచు కున్న స్కూలు, అప్పటి ఆటలు—

ఆ సాయంత్రాలు స్కూలు గదులు కురిసి సెలవిస్తే చిత్తుగా తడిసి రావటం, అన్నీ హరి కళ్ళముందు మెదులుతాయి—

"తిరిగి ఆఫీసులో జాయినయ్యేందుకు గడువు ఓరోజు ఏలానూవుంది. ఓమాటు దిగితేనో ?" అనుకున్నాడు. అలా అనుకుంటేనే హరి మనస్సెంతో పురకలు వేసింది— మధురజ్ఞాపకాలు అతని హృదయాన్ని చుట్టుముట్టేశాయి—

ఇటువంటప్పుడు విజయరాజ్ వుంటే తనకెంతో సహాయకారిగా వుండేవాడు ! అనుకున్నాడు—

విజయరాజ్ తనతో చిన్నప్పట్నించీ చదువుకున్నాడు— ఇన్నేళ్ళ జీవితంలో తన మనసుకు దగ్గరగా వచ్చిన వ్యక్తి ఒక్క విజయరాజ్— రెండేళ్ళపాటు నిరుద్యోగంతో పోరాడి, యేడాది క్రితమే మద్రాసులో స్థిరపడ్డాడు—

హరికి చటుక్కున ఐదేళ్ళ క్రితం విజయరాజ్ వ్రాసిన ఉత్తరం గుర్తుకొచ్చింది అప్పట్లో అతను విజయనగరంలోనే వుండేవాడు— ఆ ఉత్తరం ఒక విధంగా తనలో సంచలనాన్ని లేవదీసింది—

"ఎవ్వరికీ చెప్పకుండా వసంత ఓకులం కానివాడితో లేచిపోయింది—" అదీ ఆ ఉత్తరం యొక్క సారాంశం. వసంత లేచిపోయి నందుక్కాదు— తనపై కక్ష సాధిస్తోందని అంతకంటెకాదు. బాధంతా.. రామూర్తి మాష్టారి మనసులో చిచ్చు రగిలిందనీ !

మాష్టారి సంగతి తనకు బాగా తెల్సు— వాళ్ళింట్లోని పూర్వాచారులు, మడి తడి, నిష్ఠ, దైవభక్తి— అన్నీ తనకు తెల్సినవే ! తన చిన్ననాటి జీవితమంతా యించుమించు మాష్టారి యింట్లోనే గడిచింది. మాష్టారు దయాస్వభావులే కాదు- గొప్ప జ్ఞానికూడ ।

వసంత మాష్టారికి ఒక్కగా నొక్క కూతురు—కూతుర్లా కాకుండా కొడుకులా పెంచారామెను మాషారు—

వసంత చాల తెలివైన పిల్ల— రసార్ద్ర హృదయ మామెది ! వెన్నెల, బంగారం కలిపి మరిగించి తయారుచేసిన బొమ్మలా వుండేది.

వసంతను తల్చుకుంటే జాలేస్తుంది జీవితంలో యేకారణంచేతో యేర్పడ్డ లోటుచే

మనసుకుంచుకుపోయి కన్న ప్రేమను, పెంచిన అనుబంధాల్ని తెంచేట్లుచేసి మనిషిని అక్రమ మార్గాన్ని నడిపిస్తుందేమో ననిపించింది—

" పొంగిపొరలే సెలయేరు లాంటి వయసు ఎవరికోసమో తెలుసా " అని ఒక పాటపాడి, తనను రాగం కూర్చుమంది వసంత ఒకనాడు— దుడుకుతనం గల మనిషి వసంత— ఆ పాట ఆ చరణాలు, ఆ భావం చూస్తే పదహారేళ్ళు నిండని వసంతలో యింతటి వూహ ఎలా కల్గిందా అని ఆశ్చర్యపోక తప్పదు.

" ఏమిటి వసంతా తప్పు గాదూ "

" ఇందులో తప్పేముంది ? రాగం కూర్చలేనంత యిబ్బందిగా వుందా నీకు నాపాట " పెంకెగా అన్నా దానివెనుక వసంత గుండెలో గూడుకట్టుకున్న భావాన్ని హరి గ్రహించక పోలేదు—

రామూర్తి మాస్టారు తనకు మాస్టారే కాదు— తన బాగోగులుచూసే తండ్రి మమతాను రాగాలు కురిపించే తల్లి. తన నడవడికను తీర్చిదిద్దే మనీషి !

దూరంగా వుంటూ తను తప్పించుకు పోతున్నకొద్దీ వసంత అల్లరి ఎక్కువయ్యేది-

" మనిషన్నవాడికి మనసెంత ప్రధానమో, ఆ మనసుని అందమైన వూహల మధ్య తేలియాడించడం కూడ అంతే అవసరం " అంది ఓరోజు—

" ఊహాసౌధాల్లో తేలియాడించి మనసును మభ్యపెట్టేకంటె వాస్తవదృక్పథంతో ఆలోచింపజేయటం ముఖ్యం " అన్నాడు హేళనగా—

అపుడామె వదనం ఎంత ఎర్రబడిందని !

రైలు ఆగింది— ఆలోచనల్లోంచి తేరుకుని సూట్‌కేస్ తీసుకుని దిగి బయట కొచ్చాడు శ్రీహరి.

చినుకులు సన్నగా ఆరంభమయ్యాయి— ఎక్కడకు వెళ్ళాను అని ఆలోచిస్తున్నవాడల్లా ఓ నిర్ణయానికొచ్చి రిక్షాను పిల్చి కూర్చున్నాడు— ఎందుకో లాడ్జిలో దిగాలనిపించలేదు- మాస్టారి ఎడ్రెసు తెలిసిందా సరి— లేకపోతే రాత్రి ట్రైన్‌లో బయల్దేరటమే.

రిక్షా నాపించి, స్కూలువంకో సారి చూసి. దిగి లోపలికి నడిచాడు — స్కూలంతా నిశ్శబ్దంగావుంది — అన్ని గదులకూ తాళాలు బిగించివున్నాయి— తెరచివున్న ఒక్క గదీ హెడ్‌మాష్టరుది. లోపలకువెళ్ళి, కాస్సేపట్లోనే తిరిగొచ్చి రిక్షాలో కూలబడ్డాడు.

ఆలోచనల్లోనే రిక్షా వూరిచివరకొచ్చేసింది. రిక్షావాడికి డబ్బులిచ్చి దిగి నడవడం మొదలుపెట్టాడు. దూరంగా ఓ తాటాకుల యిల్లు కన్పించింది— ఇంటిముందు పూల మొక్కలు, చుట్టూ వెదురు దడి—

గేటు తీసుకుని లోపలికి అడుగెయ్యబోతూ ఆగాడు— లోపల్నించి ఖంగుఖంగుమని దగ్గు విన్పించింది, కాస్సేపటికి దగ్గు ఆగి, 'ఎవరూ?' అన్న గొంతు విన్పించింది-

సందేహంలేదు! ఆగొంతు రామ్మూర్తి మాష్టారుది. దగ్గరగావెళ్ళి, 'నేను మాష్టారూ' అన్నాడు. మాష్టారు కళ్ళజోడు సరిచూసుకుని దీక్షగాచూసి "ఎవరా "అన్నారుమళ్ళీ-

"నేను మాష్టారూ. శ్రీహరిని. జ్ఞాపకం లేనూ" నవ్వుతూ ఎదురుగావున్న కర్ర స్టూల్ మీద కూర్చున్నాడు. అతిప్రయత్నం మీద గుర్తుతెచ్చుకుని. "ఓ— నువ్వటోయ్! పోల్చిపట్టలేనంతగా మారిపోయావ్ సుమా" అన్నారాయన.

"మీరు రిటైరైనట్లు తెలియదు మాస్టారూ, మీకోసం స్కూలుకెళ్ళాను"

"అలాగా 'అన్నట్లు తల పంకించి "ఏం చేస్తున్నావిప్పుడూ" ప్రశ్నించేరు, "కలకత్తాలో జూనియర్ సైంటిఫిక్ ఆఫీసరుగా పనిచేస్తున్నాను మాస్టారూ. నేనీస్థితిలోవున్నానంటే అంతా మీఅభిమానమే" ఆయన ముఖంముందు అనాల్సినమాట కాకపోయినా మనసులోని మాట దాచుకోలేకపోయడు శ్రీహరి.

"నాదేముందోయ్, నీతెలివితేటలకొద్దీ నువ్వు పైకిపోయావ్. ఇప్పుడు వా మనస్సెంత వుప్పొంగిపోతోందో తెల్సా?" మాష్టారిగొంతు బొంగురుపోయింది— కళ్ళజోడుతీసి కనుకొనుకుల్లో వూరిన కన్నీటిని ముతక పంచతో అద్దుకున్నారు.

మాస్టారు నిజంగా దైవస్వరూపులనిపించిందాక్షణాన—తండ్రిలేని తనను దగ్గరకు తీయడం, వూరికినే పాఠాలుచెప్పి, వారి కుటుంబ సభ్యులలో ఒకరిగా తనను చూడ్డం యేరోజుల్లో అయినా అలా వుండగలిగేదెందరు?

తలెత్తి మాష్టారివంక చూశాడు. నీరు గావి పట్టిన ముతక ఖద్దరు పంచ, పల్చని లాల్చీ, వున్న వయసును రెట్టింపు చేయగల కళ్ళజోడు, గుండెల్లో గూడు కట్టుకున్న విషాదాన్ని ప్రతిబింబించే ముఖం— ఆయనలో అప్పటిరూపు మచ్చుకైనా కల్పించలేదు శ్రీహరికి,

'నా జ్ఞాపక శక్తి కూడ మందగిస్తోంది చూశావా' అని,

'అమ్మాయ్ వసంతా ఎవరొచ్చారు చూడు' అంటూ కేకేశారు మాసారు,

'వసంత యిక్కడే వుందా మాసారూ ?' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు శ్రీహరి.

'బ్రహ్మదేవుడు దానిని ఆడదానిగా పుట్టించి అన్యాయం చేసినా నాదృష్టిలో అది కొడుకేనయ్యా' మాసారు తల దించుకున్నారు. తెర తొలగించుకుని గుమ్మందాటి గబుక్కున యివతలకొచ్చి శ్రీహరిని జూసి చటుక్కున నిలబడిపోయింది వసంత వసంతను జూస్తూనే శిలాప్రతిమయ్యాడు శ్రీహరి.

'నువ్వా శ్రీహరీ— ఎవరో అనుకున్నా' వసంత. ఆగొంతులో అతడికు మునుపు లేనిజీర వసంతాన్ని మింగిన ప్రకృతి గొంతులా అన్పించింది శ్రీహరికి— కొండంత సంతోషమూయేమూలో తొక్కబడి లాంఛన ప్రాయంగా వచ్చిన నవ్వు పలకరింపై శ్రీహరి పెదవుల గుండా తొంగి జూసి మాయమైంది, వసంత నిలా జూడాల్సి వస్తుందని అతనెన్నడూ అనుకోలేదు— వసంత నుదిటిపై వుండి తన అందాన్నే ద్విగుణీకృతం చేసుకునే తిలకం ఆమెను శాశ్వతంగా వదిలివేస్తుందని కలలో కూడ వూహించలేదు, పెళ్ళయినదికాబట్టి కాస్త మారి వుంటుందేమోననుకున్నాడు గాని యీమార్పు నూహించలేదు శ్రీహరి,

ఎప్పుడు వెళ్ళి ఎప్పుడు వచ్చిందో 'కాఫీ తీసుకో శ్రీహరీ' అంది. నేలమీద స్టూలుకు దగ్గరగా కాఫీగ్లాసు నుంచుతూ ఎందుకో మళ్ళీ వసంత ముఖంలోకి చూడలేక పోయాడు— వసంత లోపలికి వెళ్ళిపోయాక ఎన్ని నిముషాలు మౌనాన్ని పాటించామో. తనూహిస్తునది నిజమేనా? లేక పొరబడుతున్నాడా ?

'యేమిటి మాష్టారు.... వసంత....

మాటలు పెగల్లేదు.

'అంతా నాఖర్మ నాయనా- వసంత తప్పేచేసిందో మనసుకు నచ్చిన పనే చేసిందో గాని నా యిష్టాలతో ప్రమేయంలేని పెళ్ళి చేసుకుంది— కానీ దేవుడు నాకా శిక్ష చాల దనుకున్నాడు— ఓబిడ్డకు తల్లినిచేసి దాని కుంకాన్ని తుడిచేశాడు— ఇపుడా అగ్నిని నేను తప్ప యింకెవరు భరించగలరు బాబూ మాష్టారు కళ్ళొత్తుకున్నారు. ఇక ఆయనను మాట్లాడించడం యిష్టంలేక 'అలా ఒకసారి వూళ్ళోకి వెళ్ళొస్తాను మాష్టారూ' అంటూ లేచాడు శ్రీహరి,

'వంటయిపోయింది— త్వరగా వచ్చెయ్యినాయనా' అన్నపూర్ణమ్మగారి గొంతు విన్పించింది.

మౌనంగానే గుమ్మం దాటాడు శ్రీహరి.

సంధ్యకాంతిపోయి చీకటి ముసురుకుంది— విడి, ఎగిరిపోతున్న మబ్బు పిందెల్లోంచి మసగ్గా కన్పిస్తున్నాడు చందురుడు— మసగవెన్నెట్లో తామర కోనేరు ముసుగు కప్పిన దేవతాస్త్రీలా వుంది—

కోనేరు మెట్లమీద చతికిలబడ్డాడు శ్రీహరి. పదిహేనేళ్ళ క్రితం యిదే కోనేటి దగ్గర తనూ వసంతా కబుర్లు చెప్పుకోడం గుర్తుకొచ్చిందతనికి.

తామర పువ్వుల్లోని అందాల్ని వసంత చూస్తే తామరాకు మీద నీటిబిందువుల్ని తను చూసేవాడు అప్పటి ఆలోచనల్లోనే ఎంతతేడా ?

లేమిలో పుట్టి తండ్రి ప్రేమకు దూరమై బాధ్యతల బరువుల్ని మోసేందుకే బ్రతికే తన ఆలోచన లెక్కడ ? లోటంటే యేమిటో ప్రేమకు దూరమవడమంటే యేమిటో తెలియకుండా పెరిగిన వసంత ఆలోచన లెక్కడ ?

వసంతను కాదనటానికి యిదొక్కటె కారణం కాకపోవచ్చు, తనవంటి వాడామెకు తగడు— ఆ సంగతే తను శాశ్వతంగా విశాఖపట్నం మామయ్య గారింటికి వచ్చే ముందు వసంతతో అన్నాడు.

ఆమె కళ్ళలో నీరు సుళ్ళు తిరిగింది

'నాదేతప్పు శ్రీహరీ— అనుమతి తీసుకోకుండా ఆరాధించడం, ప్రేమించడం తప్పే—' ఆమె గొంతు బొంగురు బోయింది

పదేళ్ళు గడిచిపోయాయి—

అయితే వసంతకు జరిగిన యీ అన్యాయానికి తనుకూడ ఒకందుకు బాధ్యుడే అన్పించింది శ్రీహరికి.

అప్పుడే తను 'ఊఁ' అనివుంటే వసంత తనజీవితంలోకి అడుగుపెట్టి వుండేది. తను ప్రేమించే స్త్రీ కంటె తనను ప్రేమించే స్త్రీ దొరకటం వల్లనే మగాడెక్కువ సుఖపడతాడట—

ఇంటికొచ్చేసరికి ఆరు బైట కుర్చీలో కూర్చుని ఎదురు చూస్తున్నారు మాసారు— పసిదాన్ని డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళిందట వసంత—మాసారి కెదురుగా కూర్చున్నాడు శ్రీహరి—

వెన్నెల పల్చగా చీకట్లోని పూల మొక్కలపై పరుచుకుంది. చంద్రుడి చుట్టూ తెల్లమబ్బులు పూలబంతి చుట్టూ దేవతా స్త్రీల్లా వున్నాయి,

'అడగటం మరచాను— నీకు పెళ్ళయిందా శ్రీ హ రీ' అకస్మాత్తుగా మాసారి నోటివెంట వెలువడ్డ ప్రశ్నకు వులిక్కిపడి

లేదు మాసారూ' అన్నాడు—

కాస్సేపు ఆగాక

'నేను జీవితంలో పెద్దపొరపాటే చేసేనోయ్' అన్నారు తిరిగి.

'యేవిటి మాసారూ అది? కళ్ళెత్తి శ్రీహరి ముఖంలోకి చూసి తలొంచుకున్నారు మాసారు.

'వసంత యీ స్థితికి రావటానికి నా పొరపాటుకూడవుంది' వుద్వేగంతో ఆయన గుండెలవిసిపడ్డాయి— దాన్నినేనెన్నడూ ఆడపిల్లలా చూడలేదు— దాని కోర్కెలను దాని మనసునూ అర్థంచేసుకోలేదు— అప్పట్లో తండ్రిగా నాబాధ్యతను కొంతైనా గుర్తించివుంటే వసంత యిప్పుడిలా నిత్యాగ్నివస్తూ బ్రతికేదికాదు' మాసారి గొంతు బొంగురు బోయింది,

ఆకాశంలో మబ్బుతునకలు దూరంగా పారిపోతున్నాయి— అంతవరకూ స్థంబించినగాలి మందంగా వీచడం మొదలు పెట్టింది— మనసు నావహించుకున్న ఆలోచనలను పూర్తిగా తరిమికొట్టి మాసారి వంక చూశాడు శ్రీహరి. మబ్బులు కమ్ముకున్న ఆకాశంలా దైన్యంగా వుందాయన ముఖం.

'మీరు మరోలా భావించకపోతే ఒక్కసంగతి చెబుతాను- వసంత విషయంలో నాపొరపాటుకూడ వుంది మాష్టారూ— అందుకే యిప్పుడనుక్కుంటున్నాను వసంత జీవితంలో తిరిగి వెలుగును చొప్పించే బాధ్యత నాక్కూడా వుందని. ' తలొంచుకున్నాడు శ్రీహరి.

' అంటే ' తలెత్తి శ్రీహరి ముఖంలోకి చూస్తూఅన్నారు మాష్టారు.

'మీరు నాకా అవకాశాన్ని కలిగించాలి '

గేటు తెరుచుకుని వసంత రావటంతో ఆ ప్రసక్తి అంతటితో ఆగిపోయింది,

● ● ●

మంచం మీద పడుకున్నాడేగాని ఆలోచనలు శ్రీహరిని నిద్రపోనివ్వటంలేదు లోపలి గదిలోంచి మాష్టారి దగ్గు విన్పిస్తోంది— వసంత గదిలోంచి పసిదానిమూల్గు విన్పిస్తోంది—

లేచి వీధి జాఫిరీ తలుపు తీసుకుని బైటకొచ్చాడు— పుచ్చపువ్వులా వెన్నెల విరిగితడుతోంది— బైం చూసుకున్నాడు— పన్నెండు దాటింది—

పరికృతంతా నిశ్శబ్దంగావుంది. వెన్నెట్లో తడిసిముద్దయ్యే మొక్కల్ని చూస్తూ అరుగుమీద కూర్చున్నాడు. ఆలోచిస్తూ ఎంతసేపలా కూర్చున్నాడో మెత్తని అడుగుల చప్పుడుకు తలెత్తి చూసి ఆశ్చర్యపోయాడు.

ఎదురుగా వసంత !

ఎన్నో మాట్లాడాలనుకున్న శ్రీహరి గొంతు మూగబోయింది.

' నాగురించి ఆలోచిస్తూ నిద్ర పాడుచేసుకుంటున్నావా శ్రీహరీ ' అంది వసంత కల్పించుకుని—

కాస్సేపాగి, ' నిన్నిలా చూడాల్సి వస్తుందని కలలోకూడా వూహించలేదు వసంతా '

' బాధపడియేంచేస్తాం శ్రీ హ రీ— కాలం ఎప్పుడూ ఒక్కలా ' వుంటుందా ? వసంతం వెళ్ళిపోకుండా వుంటుందా '

' వసతం వె ళ్ళి పో యి నా మళ్ళీ వస్తుంది వసంతా '

' అవును— నాజీవితంలో రాదు.

అంతేనా ?'

'ఈ ఋతువులూ, కాలాలూ నిబంధనలూ అన్నీ మనిషి జీవితాన్ని సుఖమయం చేయడానికే వసంతా—

నువ్వు కావాలనుకుంటే వసంతం నీ జీవితంలోనూ వస్తుంది' అని, ఆమె కళ్ళలోకి ఆశగా చూశాడు.

'నువ్వనేదేమిటో నాకు తెల్సు శ్రీహరీ— నేనీ జన్మలో మళ్ళీ వసంతాన్ని కోరుకోలేను— మా దాంపత్య జీవితం బహు స్వల్పమే కావచ్చు కానీ నామానసిక విలువల్ని పెంచినకాలమదే—'

శ్రీహరి యేదో చెప్పబోతుంటే అడ్డుపడి

'నాన్నగారితో నువ్వన్న మాటలు విన్నాను శ్రీహరీ— అందుకే నీతో మాట్లాడాలని వచ్చాను. పసితనంలో నిన్నెంతగా ఆరాధించే దానినో చెప్పలేను శ్రీహరీ— ప్రేమంటే యేమిటో తెలియని రోజుల్లో నిన్ను ప్రేమించాను. జీవితమంటే తెల్సుకుంటున్న రోజుల్లో చిత్రంగా ఆయన పరిచయమయ్యారు, నా మనసులోనే కాక జీవితంలోకూడ ప్రవేశించి 'ఇది జీవితం అన్పించేట్లు చేశారు— నాదురదృష్టం కొద్దీ ఆయన సాంగత్యానికి దూరమయ్యాను—.... కానీ శ్రీహరీ జాలిపడి, త్యాగం చేసిన నీ జీవితం నాకొద్దు— నే నది భరించలేను.'

ఆమెకళ్ళనుండి వెలువడ్డ అశ్రువులు వెన్నట్లో తళుక్కున మెరిశాయి.

క్షణకాలం ఎవ్వరూ మాట్లాడలేదు.

'నన్ను క్షమించగలవా శ్రీహరీ' అని శ్రీహరి చేతిని తనచేతిలోకి తీసుకుని నొక్కి చటుక్కున వెనుదిరిగి గదిలోకి వెళ్ళిపోయింది వసంత—


ఎంతసేపలా వెన్నెట్లో తడి. ముద్దయ్యాడో ?

చటుక్కున టైం చూసుకున్నాడు శ్రీహరి,

రాత్రి గడిచి పగటి వెలుగు జోరబడేందుకింకా రెండు గంటల వ్యవధి వుంది,

● ● ●

తూర్పు తెల్లబడ్డాక వీధి గుమ్మంలో కొచ్చి ఆశ్చర్యపోయింది వసంత. మంచం



మీద శ్రీహరికి బదులు ఉత్తరముంది.

మాష్టారూ—

ఎంత ఆశగా వచ్చానో అంతా నిరాశపడి, వేదనపడి, తీసుకున్న నిర్ణయాలైనా అమలు జరపలేని అసమర్థుడిగా వెళ్ళిపోతున్నాను— నన్ను క్షమించండి.

—శ్రీహరి

'శ్రీహరి వెళ్ళిపోయాడంటావా వసంతా ?' ఉత్తరం చూసి అన్నారు మాష్టారు—

చిగిర్చిన మామిడికొమ్మమీంచి ఎగిరిపోతున్న రామచిలుక వంక చూస్తున్న వసంత రామ్మూర్తి మాష్టారి ప్రశ్నకు సమాధానం చెప్పే స్థితిలో లేదు,

O : * : O